సంఖ్య లేకనే సర్దుబాటు

సర్కార్ బడులకు రాని పిల్లలు
- వెలవెలబోతున్న పాఠశాలలు
- డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుల తరలింపు

సర్కార్ బడుల్లో పిల్లల సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉంటుంది. అయితే విద్యార్థుల సంఖ్య తగ్గిందని చెప్పి ఉపాధ్యాయులను మరో చోటుకు పంపిస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడం వల్లే ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడుతున్నాయని కొన్ని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలో 28 ప్రభుత్వ పాఠశాలలు ఉంటే అందులో ఆరు ఉన్నత పాఠశాలల్లో మొత్తం 772 మంది విద్యార్థులున్నారు. మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 84 మంది, 19 ప్రాథమిక పాఠశాలలో 844 మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. మీర్జాపూర్, జిల్లెలగడ్డ, గాంధీనగర్, నాగారం పాఠశాలలో పిల్లల సంఖ్యలో చాలా వ్యత్యాసం ఉంది. అధికారులు చెప్పే లెక్కలతో పోలిస్తే పాఠశాలల్లో ఉన్న పిల్లల సంఖ్య తక్కువగా ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 5,368 మంది విద్యార్థులు ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో 1,702 విద్యార్థులు ఉండటం విశేషం. ప్రతియేటా చిన్నారుల సంఖ్య పెంచాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ ఆ లక్ష్యం నెరవేరలేదని పలువురు అంటున్నారు.

సర్కార్ చదువులపై నమ్మకం లేకనే..

విద్యావంతులు కాని కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకైనా నాణ్యమైన విద్య చెప్పించాలనే ఉద్దేశ్యంతో ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఏడాదికి ఇంచుమించుగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజులు కడుతున్నారు. అప్పులు చేసైనా ఫీజులు చెల్లిస్తున్నారు తప్ప.. సర్కార్ బడికి పంపడానికి ముందుకు రావడం లేదు.


విద్యార్థులులేక వెలవెలబోతున్న జిల్లెలగడ్డ ప్రాథమికోన్నత పాఠశాల

ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమా?

కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, చిన్నారులకు సక్రమంగా బోధించకపోవడం, మరి కొంతమంది సొంత పనులుపై ఇంటికి పోవడం లాంటి చర్యలను గ్రామస్తులు గమనించి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయుల తీరులో మార్పు తీసుకురాకపోతే మరిన్ని పాఠశాలలు మూత పడే అవకాశం ఉందని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

చర్యలు తప్పవు



జిల్లెలగడ్డ,గాంధీనగర్, నాగారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. జిల్లెలగడ్డలో ఏడు తరగతులకు గాను ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. దీంతో అక్కడ ఒక ఉపాధ్యాయుడితో పాఠశాల నడిపిస్తున్నారు. పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న చోటుకు ఉపాధ్యాయులను డిప్యుటేషన్ పై పంపాం. బడిబాటలో పిల్లల సంఖ్య పెంచాలని చెప్పినా కొందరు ఉపాధ్యాయుల విస్మరించారు. విధులకు వచ్చి బయట తిరిగే ఉపాధ్యాయులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– బి.మనీల, ఎంఈఓ, హుస్నాబాద్

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

నేడు పురస్కారం అందజేత


అవార్డుకు ఎంపికయిన ఫొటో


కె.సతీశ్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో వివిధ దినపత్రికలలో పనిచేస్తున్న ఫొటోగ్రాఫర్ల నుంచి ఫొటోలను ఆహ్వానించింది. అందులో జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కె.సతీశ్ పంపించిన 'రైతు భరోసా' నేపథ్యంలో తీసిన ఫొటో రాష్ట్రస్థాయిలో కాన్సొలేషన్ బహుమతికి ఎన్నికైనట్టు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని రెసిడెన్సీ బాంకెట్ హాల్ గ్రీన్‌పార్క్ హోటల్‌లో మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ బహుమతిని అందించనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఓపీ సేవల్లో మొదటిస్థానం


హేమరాజ్‌సింగ్

దుబ్బాక: దుబ్బాక వంద పడకల ఆస్పత్రి ఓపీ సేవలలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఓపీతోపాటు డయాలసిస్ సేవల్లో కూడా గతంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానాలు దక్కించుకుందని, మళ్లీ తాజాగా మొదటి స్థానం దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటంకం కల్గించడం సరికాదు


వినతిపత్రం ఇస్తున్ననాగరాజు

సిద్దిపేటజోన్: విధులను అడ్డుకోవడం సరికాదని, ఆటంకం కల్గించేవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా మీ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర మీ సేవ కమిషనర్ రవికుమార్‌పై హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తహసీల్దార్ హరికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. బెదిరింపునకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట యూసుఫ్, శంకర్, సికిందర్, శ్రీకాంత్, భరత్, వెంకట్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన సులువు


ఎగ్జిబిట్లను తిలకిస్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): బోధనా సామగ్రితోనే విద్యా బోధన మరింత సులభతరమవుతుందని ఎంఈఓ ప్రవీణ్‌బాబు అన్నారు. మిరుదొడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రాథమిక పాఠశాలల మండల స్థాయి టీఎం మేళా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు తయారుచేసి ప్రదర్శించిన ఎగ్జిబిట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ సదర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బోధనా సామగ్రిని వినియోగించి బోధిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు. ఎంఈఓ అంజాగౌడ్, హెచ్‌ఎం రామలింగం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని, సీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామచంద్రారెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం


బహుమతులు అందుకున్న విద్యార్థులు

చేర్యాల(సిద్దిపేట): సర్కారు బడులను బలోపేతం చేసేందుకు దాతల సహకారం అవసరమని ఆకునూరు ఎంపీపీఎస్ హెచ్‌ఎం మేడిచెల్మి అయోధ్య అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ సోమిరెడ్డి రామకృష్ణారెడ్డి వారసులు అందించిన నగదు బహుమతులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చి సర్కారుబడిలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సమ్మయ్య, రాజయ్య, రాధాబాయి, సరోజినీ దేవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అంది అశోక్, దాసు, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఉన్న పెద్దమ్మగుడిలో సోమవారం చోరీ జరిగింది. అరతులం బంగారంతో చేయించిన అమ్మవారి ముక్కుపుడక, ఏడున్నర కిలోల గుడి గంటలు, మరో మూడు చిన్న గంటలను దొంగలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.96 వేలకుపైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

బస్టాండ్ నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడు?

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న బస్టాండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌ల నిర్మాణాలను పూర్తిచేయకపోతే రాజీవ్ రహదారిపై ధర్నా చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, నాయకులు నవాజ్‌మీరా, ఎల్లయ్య, కనకయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ సెంటర్లతో ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ హైమావతి
- ఐటీఐ, ఏటీసీలలో ప్రవేశాలపై సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ కె.హైమావతి అన్నారు. కలెక్టరేట్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాల పెంపుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన ఈ ఏటీసీలో అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల గురించి విద్యార్థులకు చైతన్యం కల్పించాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్యను ఆదేశించారు. 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో httpr://iti.Teanfana.gov.in ధరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 98499 39025, 98662 05046, 84990 84414 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌రావు, కుకునూర్‌పల్లి ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ రామానుజ, దుబ్బాక ప్రిన్సిపాల్ జి.కనకయ్య తదితరులు పాల్గొన్నారు. పౌల్ట్రీఫారాల వ్యర్థాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, పొల్యూషన్ కంట్రోల్ అధికారులతో జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటుచేసి చనిపోయిన కోళ్లను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీపీఓ దేవకీదేవి, డీఎంహెచ్ఓ ధనరాజ్, జిల్లా పశుసంవర్ధక అధికారి నాగపూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ గౌరవానికి ప్రతీక 'సర్దార్'

సిద్దిపేటజోన్: బహుజన ఆత్మ గౌరవానికి సర్దార్ పాపన్న గౌడ్ ప్రతీకని, ఆయన చేసిన కృషి అనిర్వచనీయమని కలెక్టర్ హైమావతి అభివర్ణించారు. సోమవారం జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్సాన్ పల్లి వెళ్లే చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ పాపన్నగౌడ్ గొప్ప పోరాటయోధుడన్నారు. ఆనాడు అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ హైమావతి

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించిన అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పరిష్కరించాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, పలు రకాల సమస్యల పరిష్కారానికి 114 అర్జీలు వచ్చాయన్నారు.

ఉపేక్షించేది లేదు..

సిద్దిపేటకమాన్: సమయపాలన పాటించని వారిని ఉపేక్షించేది లేదని కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. సిద్దిపేట బస్తీ దవాఖాన, అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ డిప్యూటేషన్లు రద్దుచేశామని, దవాఖానలకు వచ్చి మెరుగైన సేవలందించాలని చెప్పారు.

రసాభాసగా స్పాట్ అడ్మిషన్లు

సిద్దిపేటరూరల్: సోషల్‌వెల్ఫేర్, కస్తూర్బా గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ రసాభాసగా సాగింది. ఒక వైపు ప్రజావాణి కార్యక్రమం జరుగుతుండగా, మరోవైపు స్పాట్ అడ్మిషన్ల కోసం జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో విద్యార్థులు తరలి వచ్చారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం అందరూ ఒకేసారి హాల్లోకి వెళ్లడానికి ప్రయత్నించడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అధికారులు పథకం ప్రకారం నిర్వహించలేదని విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు.

పీఆర్‌టీయూ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ


కలెక్టరేట్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టియూ నాయకులు

సిద్దిపేటరూరల్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న 'పెన్షన్ విద్రోహ దినం' పేరుతో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించబోయే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్ వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంటెస్టెడ్ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్‌ను అంధకారంచేసే సీపీఎస్‌ను రద్దు చేసేందుకు చేపట్టిన మహాధర్నాకు అధికసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలన్నారు. అనంతరం జేఏసీ కోచైర్మన్ విక్రమ్‌రెడ్డి, జయశ్రీ మాట్లాడుతూ సంఘాలకు అతీతంగా చేపట్టే ఈ ధర్నాకు ఉపాధ్యాయులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, శశిధర్ శర్మ, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు

అంగన్‌వాడీల నిరసన

సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకునే వారికి పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ఫేస్ రికగ్నిషన్ చేసే విధానాన్ని రద్దుచేయాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వారు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫేస్ క్యాప్చర్ తీసుకోవడంతోపాటు ఆధార్ నంబరు ద్వారా ఓటీపీ తీసుకుని వివరాలు నమోదు చేస్తున్న క్రమంలో పొరపాటు జరిగితే ఆ లబ్ధిదారులు జాబితా నుంచి పోతున్నారని వాపోయారు. ఫేస్ క్యాప్చర్‌కు తగిన ఫోన్లు, పరికరాలు అంగన్‌వాడీలకు ఇవ్వలేదని, అలాగే కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నూతనంగా తీసుకువచ్చిన ఈ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీడబ్ల్యూఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందించారు.


కొండపాకలో వేడుకలు జరుపుకుంటున్న నాయకులు


హుస్నాబాద్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

పాపన్న సాహసం యువతకు స్ఫూర్తి

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తం ఘనంగా జరిగాయి. గౌడ సంఘం నాయకులు, వివిధ పార్టీల నేతలు సోమవారం పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట సాహసం నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తుందని కొనియాడారు.

సరిపడా యూరియా అందించండి

హుస్నాబాద్: రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం వినతిపత్రం ఉంచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు పొలాలు వదిలి ఎరువుల కోసం తిరుగుతున్నారని వాపోయారు. ఒక్క యూరియా బస్తా కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారన్నారు. సకాలంలో యూరియా అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రయ్య, మల్లికార్జున్‌రెడ్డి, అన్వర్ పాష పాల్గొన్నారు.

మత్తడి పోస్తున్న వాగులు, చెరువులు


తిగుల్‌లో నిండిన మహాసముద్రం చెరువు


దూల్మిట్ట చెక్‌డ్యామ్ వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

మద్దూరు(హుస్నాబాద్)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/మర్కూక్(గజ్వేల్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మద్దూరు మండలంలో దూల్మిట్ట , లింగాపూర్ చెక్‌డ్యాంలు మత్తడి పోస్తున్నాయి. కూటిగల్ నల్ల చెరువు, తోర్నాల మోయతుమ్మెద, బెక్కల్ జెనిగల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే జగదేవ్‌పూర్ మండలంలోని రాచకట్ట జలాశయం, బొరబండ ప్రాజెక్టు నిండకుండలా మారాయి. ఇటిక్యాల, బిజివెంకటాపూర్, తిగుల్ తదితర గ్రామాల్లో వరి పొలాల్లో నీరు నిలిచింది. మర్కూక్ మండలంలోని పాతూరు పెద్దచెరువు నిండి వరద నీరు రోడ్డుపైకి ప్రవహించడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు పంచాయతీ ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డంగా ఉంచి వాహనాలు, ప్రజలు వెళ్లకుండా చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **విశ్వకర్మ యోజన పథకంపై ఆరా**

సిద్దిపేటజోన్: పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలు తీరు, ప్రయోజనాల గురించి ఆర్థిక పరిశోధన జాతీయ మండలి దక్షిణ భారత ప్రతినిధుల బృందం ఆరా తీసింది. జిల్లా కేంద్రంలోని సేట్విన్ కేంద్రాన్ని సోమవారం వారు పరిశీలించారు. కేంద్రంలో శిక్షణ పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. బృందం సభ్యులు దక్షిణ ప్రాంతీయ సమన్వకర్త హబీబ్, పథకం రాష్ట్ర ఇన్‌చార్జి అమినా భాను, సెట్విన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **పలువురికి మెమోలు జారీ**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బందితోపాటు పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్ తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకల అనంతరం సినిమా పాటలకు చిందులు వేసిన ఘటనపై ఉన్నతాధికారుల సూచనల మేరకు వారికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

◆ **విద్యాధరి సన్నిధిలో అక్షరస్వీకారాలు**

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో శ్రావణమాసం ఆఖరి సోమవారం చిన్నారుల అక్షర స్వీకారాల సందడి నెలకొంది. హైదరాబాద్, సికిందరాబాద్, ఉమ్మడి మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చదువుల తల్లి సన్నిధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపించారు.

◆ **రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు వినతి**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటును కోరుతూ అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ దిలీప్‌నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు ఆధ్వర్యంలో మండల పరిధిలోని వేచరేణి, తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలయాపల్లి, అర్జునపట్ల, దొమ్మాట, గుర్జకుంట, చేర్యాల, ఆకునూరు, రాంపూరు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేశ్, సంజీవులు, రాజేందర్, వెంకట్ మావో, మల్లేశం, ఎల్లారెడ్డి, మానస పాల్గొన్నారు.

◆ **అధిక వర్షాలతో అప్రమత్తం**

గజ్వేల్‌రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ రవికుమార్ సూచించారు. పొంగి ప్రవహిస్తున్న సంగాపూర్ చింతల చెరువు, మగ్రికుంట, ముట్రాజ్‌పల్లిలోని బడి చెరువులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలాలకు వెళ్లే రైతులు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బంగ్లావెంకటాపూర్ చెరువు మత్తడి దుంకుతున్న లోలెవల్ కల్వర్టును తొగుట సీఐ లతీఫ్, బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి పరిశీలించారు.

◆ **ప్లాస్టిక్ నివారణ కోసమే స్టీల్ బ్యాంక్**

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో ప్లాస్టిక్ నివారణ కోసమే మంత్రి పొన్నం ప్రభాకర్ స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి అన్నారు. సోమవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి దేవాలయంలో స్టీల్ వస్తువులను అర్చకులకు పంపిణీ చేశారు. ఈఓ కిషన్‌రావు, శివయ్య, వెంకటస్వామి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **రెండు బస్సులు ఢీ**

సిద్దిపేటఅర్బన్: పెట్రోల్ బంకు నుంచి కారు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటన పొన్నాల శివారులో సోమవారం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ వైపు ముందు వెళ్తుండగా వెనక నుంచి మంచిర్యాల డిపోకు చెందిన బస్సు వస్తోంది. ఈ క్రమంలో రెండు బస్సులకు అడ్డంగా కారు రావడంతో ముందు బస్సు వేగాన్ని నియంత్రించుకున్నప్పటికి వెనక వచ్చిన బస్సు వేగం అదుపులోకి రాకపోవడంతో బస్సును ఢీకొట్టింది. దీంతో మంచిర్యాల బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. డ్రైవర్ ఎండీ హఫీజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

◆ **రూ.2 లక్షల ఎల్వోసీ అందజేత**

మిరుదొడ్డి(దుబ్బాక): పాముకాటు వేయడంతో చికిత్స పొందుతున్న పోతారెడ్డిపేట కుర్మ బాలయ్యకు ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి సోమవారం రూ.2 లక్షల ఎల్వోసీ అందజేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు జిగిరి అమర్ తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకులు దేవరాజు, యాదగిరి, రాజు ఉన్నారు.